మన అల్లుడు

శ్రీమతి కోకా హనుమాయమ్మగారు

ఆవేళ గోపాలరావుగారింట్లో భోజనాల సందడి. చుట్టాలు, పక్కాలు చాలామంది వచ్చియున్నారు. అతని కూతురుకు అన్నప్రాశన మారోజు. లేకలేక పుట్టుటచే చాలా ఆడంబరముగా జేయుచున్నారు. బంధువుల రాకకు పరిమితియే లేదానాడు.

రాత్రికి భోజనాలు; గోపాలరావు భార్య వట్టి అమాయకప్రది. ఇలాంటి విషయాలేమి యెఱుంగనిది. కనుక, తన అప్పచెల్లెలు దగ్గఱలోవుంటే ఆమెను పిలిపించుకొని ఈకార్యము నెరవేర్చుమని కోరినది. అక్కకూతురునీ అల్లునీకూడా పిలిపించుకొని ఇదివరకే తనదగ్గఱవుంచుకొనియున్నది. నూత్న వధూవరులగువారు తన యింట్లోవుంటే ముద్దూమురిపెము చూచుకోవచ్చునని.

జానికమ్మకు ఇద్దఱు కొడుకులతర్వాత ఈబిడ్డ పుట్టినది. బిడ్డగాదు బంగారుబొమ్మ యని యా ఆలుమగ లత్యానందముతో మురియుచుండిరి. పిల్లలు కలగరేమోయని నిరాశచేసుకున్నారా దంపతులు. అట్టి నిరాశాంధకారములో జ్యోతిర్లతవలె ఈ ముద్దుకూన పుట్టగానే వారి యానందమున కంతులేదు. తన చిన్నారికి అన్నప్రాశనము. నేడు వారి హృదయము లత్యంతకౌతుకాన్వితములై, క్రొత్త క్రొత్త కోర్కెలీనుచుండుట వారి మోములే చెప్పక చెప్పుచున్నవి చూపఱులకు.

ఇట్టిసమయములో జానికమ్మ రెండోకొడుకు వచ్చి 'అమ్మా, బావ కాఫీ త్రాగలేదూ. కాఫీహోటలుకి వెళ్లి కాఫీ తెమ్మని ఎవరినో డబ్బులిచ్చి పంపుతున్నాడు' అని, కొట్లో సామాన్లు తొందర తొందరగా అందిస్తూవున్న జానికమ్మ చెవులో వేశాడు.

'ఏమిటీ అబ్బాయి. బావ కాఫీ త్రాగలేదూ, నిజంగా చెప్పు. ఓరి వెధవ. ఆ ఆకతాయిగుంటడు రాముడు అందరికి సమంగా కాఫీ పోయలేదుగా మాల్ను, ఏమి బుద్ధి. అయ్యో! అక్కా! మన అల్లుడు కాఫీ త్రాగనేలేదట' అని తొందరతో అక్కదగ్గఱకు వచ్చి కేకవేసింది జానికమ్మ.

'పులావ్‌లో ఎంత జీడిపప్పువేద్దామా' అని కొలత వేస్తూవున్న సుభద్రమ్మ ఈమాట వినగానే గిఱ్ఱున తిరిగి 'ఏమి చెల్లీ! దొంగవెధవ రాముడు ఇవ్వనేలేదా! మన అల్లుడికే అందిందికాదే, ఈ గందరగోళములో అతగాడికి ఏమి కోపము వచ్చునోకదా! ఏమి ఖర్మం, చూడు నాయినా! అదెంత నిజమో కనుక్కోనిరా' అని చిన్నబ్బాయి భుజముమీద చేయి వేసి తొందరజేసింది. 'నిజమే! పెద్దీ! డబ్బులీయడం నేను చూచాను' అని నొక్కిచెప్పాడా అబ్బాయి.

'ఆ, అలాగా! ఆ ముద్దువెధవతో కాఫీ యిచ్చిరమ్మన్నాను. ఎవరికి యిచ్చినాడో ఏమిటో. 'వాడేడీ' అని కోపంతో అటుయిటు చూడగా రాముడు ఒకచేత్తో కిరసనాయిల్ బుడ్డీ ఒకచేత్తో అగ్గిపెట్టి పట్టుకొని ఆదారినే వెళ్లుతూండడం కంటబడిందామెకు.

'ఇదిగో వాడే. ఆదద్దమ్మే. ఒరే దద్దమ్మా! కాఫీ అల్లుడు బాబుకు ఇవ్వనేలేదురా? నీ తెలివి కాలిపోను' అని కోపముగా చూచింది.

'ఇచ్చానమ్మా! ఇవ్వలేదని ఎవరు చెప్పారు. త్రాగుతూ ఆ బాబుగారే అన్నారు పంచదార ఎక్కువయిందిరా అని. త్రాగేవరకు దగ్గఱనే వున్నాను'. ఈమాట లాలకించగానే అప్పచెల్లెల్లిద్దఱు నిఃశ్వపుగుడ్లువేశారు. 'ఇదేమిటీ! అబ్బాయి అలాచెపుతే వీడిలా చెప్పుతాడు' అన్నది సుభద్రమ్మ. 'అబ్బాయి తెలియక అలాఅన్నాడు. వీడెందుకు అబద్దం చెపుతాడు' అని సమాధానపడ్డది జానికమ్మ. 'వీడిమొహం. అబ్బాయి అంత నొక్కి

చెప్పుతూవుంటే ఈ దొంగవెధవమాటలకేమి, పెద్దవాళ్ల నెవరినైనా కనుక్కుందా' మన్నది సుభద్రమ్మ.

ఇంతలో గోపాలరావు వంటప్రయత్నా లెంతవరకు అయినాయి అని అడుగుతూ అక్కడకు వచ్చారు.

'చూశారూ! మన అల్లుడు కాఫీ త్రాగలేదట. అదేదో కాస్త కనుక్కుందురూ! ఈ గందరగోళంలో అతగాడికి ఏమి కోపమువచ్చునో కదా' అని జానికమ్మ మగనితో అంది. 'ఆ! ఎందుకు తాగలేదూ, రాముడు కాఫీ అందరికీ పోసినట్టున్నాడే' అన్నారు గోపాలరావుగారు. గాభరాగా 'అదేదో కాస్త కనుక్కో అబ్బాయి తెలుస్తది' అన్నది వదినగారు మరదితో. 'ఆ! అలాగేనమ్మా! కనుక్కుంటా' నని వీధివరండాలోకి వెళ్లి అల్లుడేడీ అని విమర్శించారు. ఎక్కడా అగుపడలే. ఎవరినడిగినా తెలియదన్నారు. 'మన అల్లుడు ఎక్కడకో వెళ్లియున్నాడు. వస్తే కనుక్కుంటానని' కేక వేసి వెళ్లిపోయారు.

అప్పా చెల్లెళ్లా మాటవిని నివ్వెరపాటుతో ఒకరిముఖం ఒకరు చూసుకొన్నారు.

మన అల్లుడు కోపం తెచ్చుకు బయటికి వెళ్లిపోయుంటాడా? అని వారిలోవారు తర్కించుకున్నారు.

'చెల్లీ! మన అల్లుడు అంత ముక్కోపా? అంత మాత్రంలో అలుగుతాడా?' అని అక్క లేనిధైర్యం తెచ్చుకుని అడిగింది చెల్లెలిని. 'భా, భా, నాకు తెలియదు. అతడిగుణం చిన్నప్పటినుండి నా కెఱుక. అంత మంచివాడనే కదా మనపిల్లకి అవాలని అంత పట్టుదలతో వుండేదానను' అన్నది చెల్లెలు.

ఆ ప్రక్కనే పరమాన్నంలోకని కిసిమిసిపండ్లు, ద్రాక్షపళ్లూ, యాలక్కాయలూ, జీడిపప్పూ అమర్చబడియున్న తట్టదగ్గఱ కూర్చొని నోట్లో ఒకొక్కటే వేసుకుంటూవున్న జానికమ్మ పెద్దకొడుకు విశ్వేశు అందుకని 'మన అల్లుడికి ఎప్పుడూ కోపంలేదు గానీ, ఈవేళ ఎక్కడాలేని కోపవచ్చింది. ఈ ఇంట్లో కొంచెమూ మర్యాద తెలియదు అని ఎవరితో అంటూవుంటే ఆలకించాను' అని ఒక పుల్లరాజ వేశాడు.

జానకమ్మ పెద్దకొడుకు ఇలాంటి విషయాలలో అందుకుని కథకు రమ్యం తెచ్చే పాత్రధారి. అక్కాచెల్లెళ్లు ఆందోళనపడడం వింటూవున్నాడు. వారికి మరింత గాభరాచేద్దాం అని బుద్ధిపుట్టింది. తలంపు కలుగగానే తనకు తోచిన పాచిక వేశాడు. 'ఏమిటీ నిజంగా ఏమన్నాడు బాబూ!' అని ఇద్దఱూ ఒక్కసారి అడిగారు. 'అవునే. అమ్మా! నిజమే'నని నొక్కి మరీ చురుగ్గా కళ్లెత్తి అన్నాడు. తల్లి పట్టి ఆయాయకప్రది అని తెలుసు. అందుకని మరీ చిక్కు ప్రశ్నలలో పెట్టి ఆమెను వెఱ్ఱిదానిలా ఆడించడంలో విశ్వేశు గట్టిదిట్ట.

'నిజమేనా నాయనా! నీవు ఎలా ఆలకించావు, ఎవరితో అంటుంటే ఆలకించావు' అని పెత్తల్లి వంగి విశ్వేశు తలయెత్తి అడిగింది.

'వాడి మొహం, లేనిపోనివి చెప్పడానికి వాడి తర్వాతే' అంది తల్లి.

అన్నదేగాని గుండెలు లోపల కొట్టుకుంటున్నా యామెకు.

ఇంతలో వంటబ్రాహ్మడు వచ్చి 'అమ్మా! కూరలన్నీ ఉడికిపోయాయి. పులావ్అండ పొయ్యిమీద వేయాలి. వస్తారా?' అని అడగడం వారి ఆలోచనల కడ్డుతగిలింది.

'అన్నట్టు మనం ఈ సొదలోబడి అసలు సంగతే మరచిపోయాము. అయ్యో, ఎంత వేళయిపోయిందీ, పోనిస్తూ, పిల్లనిచ్చాక ఎన్నయినా పడాలి. ఎలా వస్తే అలారానీ' అని లేని వుత్సాహం తెచ్చుకుని సుభద్రమ్మ వంటప్రయత్నంలోకి వెళ్లబోయింది.

ఇంతలో గోపాలరావుగారు పైనుండి కేకవేశారు. ఇదిగో మన అల్లుడు ఇక్కడే కాఫీ త్రాగేడట. మీరు మరేమి గాభరాపడవద్దు అని. ఇది ఆలకించి విశ్వేశు, నాన్నా! అమ్మా, పెద్దీ, మన అల్లుడు కాఫీ త్రాగలేదని బెంగపెట్టుకున్నారు అని కేకవేశాడు. కొంటెపిల్లడు ఎంతకైనవున్నాడే అని పెత్తల్లి చిన్న దెబ్బవేసింది భుజంమీద. ఇపుడు పాపం! అప్పా చెల్లెళ్లకు ఎక్కడాలేని బలం వుత్సాహం వచ్చింది. ఇద్దఱూ నవ్వుమొహాలతో చూసుకున్నారు.

౩

రాత్రి పదిగంటలకు భోజనాలు జరిగేను. ఇంతలో సుభద్రమ్మకొడుకు పెద్దవాడు వచ్చి 'అమ్మా! పాయసము చాలా బాగుండే, మరీ మైసూరుపాకము ఎవరు చేశారే! పిన్ని చేసిందా చాలా బాగుందే, మరీ, భావ మా బంతిలో భోంచేయలేదేమి' అన్నాడు తల్లిదగ్గఱకు వచ్చి. 'అన్నా! ఎంతమాట మనఅల్లుడు భోంచేయలేదంట చెల్లీ!'

'అతన్ని సరీగా పిలచి కూచోపెట్టినవాళ్లు వుంటే కదూ, అవురా! అబ్బాయి! బావ భోంచేయ లేదని మెల్లిగా చెపుతున్నావు, ఛీ, దద్దమ్మా! పిలచి పక్కన కూచోపెట్టుకోకుండా ఎలా భోంచేశావ్? నీకరితమర్యాద ఏడుస్తే కదూ' అని కొడుకుని కూకలు వేసింది సుభద్రమ్మ. 'అదేమో! నాకేమి తెలుసు, పెద్దవాళ్లంతా వుండగా నేనా పిలచేది, పిలుస్తేమాత్రం వస్తాడా' అని ఆ అబ్బాయి కస్సుమంటూ వెళ్లిపోయాడు. అయ్యో గ్రహచారమా! మన అల్లుడుకే ఆఖరికి సున్నం అని ప్రక్కనున్న విశ్వేశు అందుకున్నాడు.

'వీడు ఒకడమ్మా మనని వేళాకోళం చేయడానికి, చూడునాయనా, నువ్వు కొంచెము కనుక్కురా', అని బుజ్జగిస్తూ పెత్తల్లి తొందరబెట్టింది. 'అదేమో నాకు తెలియదు మధ్యాహ్నం కాఫీ అందలేదూ, ఆ కోపానికే యివుడు భోంచేయలేదుగామాలు, మన అల్లుడో మనఅల్లుడో అని ఒగర్చడమే గాని ఎవరూ అతన్ని సరీగా కనుక్కోరు, ఇద్దరత్తలుండీ' అని భీష్మించుకొని నిలబడ్డాడు.

'అవును, నిజమే, బిడ్డడు అన్నట్టు, అతడిని సర్గ్గా కనుక్కునేవారే లేరు, అందుకే కోపం వచ్చివుండొచ్చూ' అని సుభద్రమ్మ చిన్నబుచ్చుకుంది.

'ఛా, వీడి మాటలకేం, అతడంత కోపిస్తా, నాకు తెలియదూ' అంది చెల్లెలు, అక్కమాటలు తోసిపుచ్చి.

వాళ్లమట్టుకి వాళ్లే ఇన్నిమాటలు అనుకుంటారు గాని, నిజమయిన సంగతేమొ కనుక్కరమ్మని పెద్దవారి నెవరిని బయటకు పంపరు.

ఇలా వుండగా వడ్డనబ్రాహ్మడు వచ్చి, 'అమ్మా! ఆడవాళ్లంతా విస్తరాకులదగ్గఱ కూచున్నారు. వడ్డించమంటారా!' అని వాళ్ల ఆలోచన్ల కడ్డువచ్చాడు.

'అవురా? అబ్బీ! అల్లుడుబాబు బంతిలో కూచోలేదూ' అని ఇద్దఱూ ఏకకంఠంతో అడిగారు.

'అవునమ్మా, చూసినట్టున్నానూ, కాకీ కమీజాపైనవాణీ వేసుకున్నవారు కదూ.'

'ఆ! ఆ! అతనే' అని వుత్సాహంతో అన్నారప్పచెల్లెళ్లు.

ఆ ప్రక్కనున్న విశ్వేశు 'అతడుకాడే, కాకీ కమీజా మనఅల్లుడు ఒక్కడే వేసుకున్నాడా? ఈ గుడ్డివెధవ చెప్పడం, మీరు నమ్మడమూను!' అని వారి వుత్సాహం అంతా ఒక్కదెబ్బతో ఎగరగొట్టాడు.

'ఇదేమిటే, అబ్బాయి అన్నట్టు నిజమే ఇంకెవరి నయినా అడుగుదాం' అని బుచ్చీ?, అంటూ లేచేసింది. పాపం, ఈ అప్పాచెల్లెండ్రు ఎంతకీ రాకపోవుటచే, వంటబ్రాహ్మఱు వడ్డించక అలా నిలచిపోయారు.

పాపం, ఆకలిమంటచే ఆకులదగ్గరున్న ఆడవాళ్లు అలాగే కునుకుతున్నారు. పదకొండున్నరయింది, ఇంకా వడ్డన్లు లేవు అల్లుని సందట్లో.

బుచ్చి ఆరేళ్లవాడు, 'ఏమే అమ్మా', అంటూ వచ్చాడు. 'అవునురా, బావ భోంచేశాడు' అంది సుభద్రమ్మ కోపంతో. 'ఏమోనే నాకేం తెలుసూ! పెద్దవాళ్లంతా ఒకమూల కూచున్నారు. చిన్నవాళ్ల మేమంతా ఒకమూల కూర్చున్నాము. నాన్ననైనా చిన్నన్ననైనా కనుక్కో' అని బుచ్చి వెళ్లిపోయాడు.

'ఇదేమి కర్మం అమ్మాయి! ఎవరూ సరిగా కనుక్కునేవారే లేదే' అంది నిట్టూర్పు తీస్తూ సుభద్రమ్మ. ఇంతలో గోపాల్‌రావు 'ఏవర్రా ఆడవాళ్ల భోజనాలయినాయా' అంటూ తనముద్దుల కూతుర్నెత్తుకుంటూ వచ్చారు.

అక్కడున్న వంటవాడు 'లేదూ బాబూ! అమ్మగారూ! సుభద్రమ్మగారూ, ఏదో గాభరామాటలనుకుంటున్నారు' అన్నాడు. 'ఏమి గాభరామాటలూ' అన్నాడు గోపాలరావు.

'నాకేమి తెలుసు బాబూ! ఏదో అల్లుడు బాబు గురించి మాట్లాడుకుంటున్నారు, సుస్త్రీ యేదో చేసిందట. అమ్మగార్లిద్దరూ చిన్నబోయిన మొహాలతో వున్నారు, ఎక్కడ పనులక్కడే వున్నాయి' అని వాడు తెలిసీ తెలియనివార్త ఆయనతో మెల్లగా ఏకరువు పెట్టాడు.

'అరే, ఏమిసుస్త్రీ ఇందాక మాబంతిలో భోంచేశాడే అల్లుడు. ఇదేమిటీ' అని ఆత్రుతతో లోపలికి వెళ్లారు. ఇల్లంతా నిశ్శబ్దం.

'ఏవర్రా! మనఅల్లునికి ఏమయిందీ' అని అడిగారాత్రుతతో.

'ఏమయింద'న్నారిద్దరూ దిగాలుపడి. 'ఏమో మీరంతా అల్లునిగురించి గాభరాగా మాట్లాడుకుంటున్నారట. ఇప్పుడిప్పుడే బంగారంలా మా బంతిలో భోంచేశాడే, ఏమయిందిప్పుడూ' అని నివ్వెరపాటుతో అడిగారు.

'ఆ! ఏమిటీ! అల్లుడు భోంచేశాడు. అమ్మ గుంటలు ఎంతకైనా తగుదుర్రా. మనఅల్లుడు భోంచేయలేదని ఆ గుంట వెధవ చెప్పాడు. అందుకని యింత కంగారు పడ్డాము అంతే' అన్నారా మగువలు నగుమొగముతో.

'ఓసి, ఇదా! వెఱ్ఱివాళ్లు! సరిగా ఎవరినైనా కనుక్కుంటే తెలియదూ? ఆ ఆకతాయి గుంటలు చెప్పడం, మీరు ఇంత కంగారు పడడం, మంచి బుద్ధిమంతులే, కానీండి. ఇంకా భోజనాలే లేవు. ఇపుడు పన్నెండు అయింది. ఛీ! ఛీ! ఈ ఆడవాళ్లకు ఇదొక వెఱ్ఱిఅల్లుడో అల్లుడో' అని అని నాలుగుచీవాట్లు వేశారు.

ఇంతలో అల్లుడు వచ్చాడు. మామగారు జరిగినదంతా చెప్పారు.